

ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

ఇందిరమ్మ ఇళ్ల సర్వే 93 శాతం పూర్తి

» త్వరలో చేపట్టనున్న లబ్ధిదారుల ఎంపిక

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ ఇంటింటి సర్వే తుది దశకు చేరుకుంది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1.76 లక్షల మంది ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఐదు నియోజకవర్గాలకు 17,500 ఇళ్లు మంజూరు కానున్నాయి. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలల్లో దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరుకుంది. పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు సర్వే చేస్తున్నారు. సంక్రాంతి వరకు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 93 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయింది. సర్వేలో వేల సంఖ్యలో పేర్లు గల్లంతైనట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎక్కువగా ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల సర్వేలో తెలుస్తోంది. త్వరలోనే సర్వే పూర్తి చేసి లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

నూతన ప్రాజెక్టులకు ఆహ్వానం

» కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసం పని చేస్తున్న అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి నూతన ప్రాజెక్టుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 2024-25 నూతన ప్రాజెక్టుల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 15 వరకు అవకాశం ఉన్నందున ఆన్‌లైన్‌లో ఎన్‌జీవో ట్రైబల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బస్తాకు రూ.100కు పైగా పెంపు

డీఏపీపై రూ.300 పెంపునకు నిర్ణయం


యాసంగి సీజన్‌పై అన్నదాత ఆందోళన

పలు చోట్ల ఎరువుల కృత్రిమ కొరత

ప్రభుత్వాల సబ్సిడీపై రైతుల ఆశలు

పెట్టుబడి సాయానికి తప్పని ఎదురుచూపు

"అసలే పెట్టుబడి భారం పెరిగి సతమతమవుతున్న అన్నదాతలకు కొత్త ఏడాది ఆరంభంలోనే పెరిగిన ఎరువుల ధరలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో ధరలు పెరగడంతో పాటు ఉమ్మడి జిల్లాలో కొరత మొదలైంది. దీంతో యాసంగి సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకుల ధరలు పెరిగాయంటూ ఎరువుల తయారీ కంపెనీలు అకస్మాత్తుగా ఎరువుల ధరలు పెంచేందుకు సిద్ధమయ్యారు. దీనికి ముందుగానే వ్యాపారులు కొంత మేర ధరలు పెంచేశారు. మరికొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు.





ఎరువుల ధరలకు రెక్కలు

ఏడాది ఆరంభంలోనే అన్నదాతలకు షాక్

యాసంగి సీజన్‌లో ఎరువుల వినియోగం
(జిల్లాల వారీగా మెట్రిక్ టన్నుల్లో)

వికారాబాద్	28,260
రంగారెడ్డి	28,293
మేడ్చల్	2,500

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో యూరియాతో పాటు 20:20:0:15, 14:35:14 కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఈ ఏడాది ఆరంభం నుంచి పెంచేశారు. ఈ ఎరువులన్నీ బస్తాకు రూ.100 చొప్పున పెంచి అమ్ముతున్నారు. ఇదిలా ఉంటే డీఏపీ ధరను గణనీయంగా పెంచేందుకు ఎరువుల కంపెనీలు సిద్ధమయ్యాయి. బస్తాకు రూ.300 వరకు పెంచాలని కంపెనీలు ఇప్పటికే నిర్ణయించాయి. ఈ భారం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత మేర సబ్సిడీ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొత్త ధర అమల్లోకి రాక పోయినప్పటికీ వ్యాపారులు మార్కెట్‌లో కొన్ని చోట్ల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. పలు చోట్ల యూరియా, డీఏపీ సరఫరా తక్కువగా ఉంది. సాధారణంగా యాసంగి, వానాకాలం సీజన్‌లలో ప్రతీ పంటకు ఎకరానికి సగటున రెండు బస్తాల కాంప్లెక్స్ ఎరువుల్ని రైతులు వినియోగిస్తుంటారు. అయితే రైతులు వినియోగించే ఈ ఎరువుల

మిగతా 5వ పేజీలో...





'చౌడాపూర్'కు నూతన పీఏసీఎస్

చౌడాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలానికి నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని(పీఏసీఎస్) ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు అవసరమైన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం చౌడాపూర్ కులకచర్ల సహకార సంఘం పరిధిలోనే కొనసాగుతోంది. మండలంలోని రైతులు కులకచర్ల సహకార సంఘం నుంచి పంట రుణాలు, బంగారంపై రుణాలు పొందుతున్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని అన్నీ గ్రామాల రైతుల వివరాల ధ్రువపత్రాలు కులకచర్ల సహకార సంఘం అధికారులు వేరు చేస్తున్నారు. 2026లో జరిగే సహకార సంఘం ఎన్నికల్లో చౌడాపూర్ సహకార సంఘానికి చైర్మన్, డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.

స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

తాండూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లు గుర్తు చేశారు.

శంషాబాద్‌లో దారుణం

కోడలిని హత్య చేసిన అత్త

మరో వ్యక్తి సాయంతో సెల్లార్‌లో పూడ్చిపెట్టిన వైనం

5

వ్యవసాయేతర భూముల్లో సోలార్ ప్లాంట్లు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

కులకచర్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుకూలంగా లేని చెంచు రైతుల భూముల్లో కుసుమ ప్రాజెక్టు ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తి చేసి వ్యవసాయానికి అందిస్తామని డీఆర్‌డీవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని సాల్విడ్ గ్రామంలో చెంచు రైతులతో ఆయన సమావేశమయ్యారు. భూముల్లో సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి వసతి లేని కారణంగా రెండు పంటలు సాగు చేయడం లేదని అక్కడి రైతులు తెలిపారు. నిరుద్యోగ యువకులకు జాబ్ మేళా ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం చెంచు కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక విషయాలు తెలుసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చారిత్రక విషయాలు, వ్యక్తిత్వాలు గురించి తెలుసుకోవడం అలవాటుగా మార్చుకోవాలని పోస్టల్ శాఖ సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం సూచించారు. వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న పోస్టల్ ఫిలాట్లీ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,300లకు పైగా ఇతి వృత్తాలపై ఎగ్జిబిట్లను ప్రదర్శించారన్నారు. జిల్లా వ్యాప్తంగా 19 పాఠశాలల నుంచి సుమారు 2 వేల మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. పాఠశాల విద్యార్థులకు లెటర్ రైటింగ్, వ్యాసరచన, క్విజ్, స్టాంప్‌డిజైన్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. మన దేశ చరిత్ర, సంస్కృతిలో ఫిలాటెలీ పాత్ర కీలకమైందన్నారు. ముగింపు వేడుకల్లో ఎస్పీ నారాయణరెడ్డి హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, విష్ణుజ్యోతి, సంపత్‌రెడ్డి, సాగర్, వెంకన్న, ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, రాకేష్ రెడ్డి పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

» ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పరిగి,జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో వందశాతం ఫలితాలు తీసుకురావాలని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్ అన్నారు. గురువారం పరిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను మానసికంగా, భౌతికంగా సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు పర్యావరణ విద్య, ఆంగ్లం, ప్రాక్టికల్స్, సైన్స్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. 20 రోజులపాటు ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షల భయాన్ని విద్యార్థుల్లో తొలగించాలన్నారు. సమావేశంలో ప్రాధానాచార్యులు కుమారస్వామి, థామస్‌రెడ్డి, ఉమా, సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో రేణుకాదేవి

నాణ్యమైన విద్యను అందించాలి

» డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) జిల్లా శాఖ క్యాలెండర్‌ను డీఈవో రేణుకాదేవి టీటీయూ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రేయరావు, ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు లక్ష్మయ్య, గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు కొనుగోళ్లు

జిల్లాలో 51,827.40 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రైతుల ఖాతాల్లోకి చకచకా డబ్బులు జమ

జిల్లా వ్యాప్తంగా రూ.120.82 కోట్ల విలువైన వడ్ల కొనుగోళ్లు

ఇప్పటికే రూ.116.82 కోట్ల చెల్లింపులు పూర్తి

ఆనందం వ్యక్తం చేసిన రైతులు

యాలాల మండలంలో అత్యధికంగా సేకరణ

సన్న రకాలు సేకరణ (మెట్రిక్ టన్నుల్లో..)

డీసీఎంఎస్	1,398.68
ఐకేపీ	2,577.52
పీఏసీఎస్	5,312.64
మొత్తం	9,288.84

తాండూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో చివరి దశకు చేరుకున్నాయి. చెల్లింపులు సైతం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వెంటవెంటనే జరిగాయి. నాలుగు రకాల కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వానాకాలం సీజన్‌లో గతంలో ఎప్పుడూ లేని విధంగా దొడ్డు రకం, సన్న రకం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఐకేపీ కేంద్రాల ద్వారా అత్యధికంగా కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,28,218 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారు. మొత్తం 30 కేంద్రాల ద్వారా 2024 నవంబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు(దొడ్డు, సన్నాలు కలిపి) 51,827.40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు రైతులకు రూ.120 కోట్లు చెల్లించాల్సి ఉండగా జనవరి 9వ తేదీ నాటికి రూ. 116.82 కోట్లు చెల్లింపులు పూర్తి చేశారు. ఇలా వెంటవెంటనే డబ్బులు జమ చేయడం ఇదే మొదటి సారి అని అధికారులు పేర్కొంటున్నారు. రైతులు సైతం త్వరగా తమ ఖాతాల్లోకి డబ్బులు పడ్డాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యాలాల మండలంలో ఎక్కువ..

ఇంకా రూ.4 కోట్లు మాత్రమే రైతులకు చెల్లించాల్సి ఉంది. వీటిని కూడా ఒకటి రెండు రోజుల్లో చెల్లింపు చేయనున్నట్లు డీసీఎంఎస్ అధికారులు వివరించారు. డీసీఎంఎస్ అధికారులు, సివిల్ సప్లయి అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వివరాలు సేకరించడంతో పాటు డాటా ఎంట్రీ

మిగతా 6వ పేజీలో...



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం..(ఫైల్)

డబ్బులు సకాలంలో చెల్లించారు



ఈ సారి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి వారం రోజుల్లోనే ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. గతంలో చెల్లింపులు ఆలస్యమైనా ఈ సారి మాత్రం సకాలంలో చెల్లించారు. అయితే బోనస్ మాత్రం కొంత ఆలస్యంగా ఖాతాల్లో జమవుతుంది. సన్నాలు వేసుకున్న రైతులు అధికంగా ధాన్యాన్ని అమ్మకుండా సొంతానికి బియ్యం మిల్లింగ్ చేసుకున్నారు.

-ఒడిగే శ్రీనివాస్‌రెడ్డి, రైతు , తాండూరు


ధాన్యం కొనుగోలు వివరాలు సెంటర్ల వారీగా (దొడ్డు రకం.. మెట్రిక్ టన్నుల్లో..)

డీసీఎంఎస్	13,289.48
ఐకేపీ	14,550.52
పీఏసీఎస్	13,301.28
ఎఫ్‌పీవో	1,396.92
మొత్తం	42,538.20

11 మండలాలు, 3 బల్దియాలకు

బీజేపీ అధ్యక్షుల ఎన్నిక

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగతంగా బలపడేందుకు ఆయా మండల, పట్టణాలకు నూతన అధ్యక్షులను నియమించింది. గురువారం జిల్లా కేంద్రంలోని హరితరిసార్ట్స్‌లో రిటర్నింగ్ అధికారి పి. శంకర్ రావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన ఆయా మండలాలు, పట్టణాల అధ్యక్షుల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 11 మండలాలు, మూడు మున్సిపాలిటీల అధ్యక్షులను ఎన్నుకున్నారు. వికారాబాద్ మండల అధ్యక్షుడిగా శివరాజ్, పట్టణ అధ్యక్షురాలిగా యాస్కి. శిరీష, కోట్‌పల్లి మండల అధ్యక్షుడిగా శివకుమార్, మర్పల్లి అధ్యక్షుడిగా రామేశ్వర్ రెడ్డి, మోమిన్‌పేట అధ్యక్షుడిగా ఆశిరెడ్డి, తాండూరు పట్టణ అధ్యక్షుడిగా నాగారం మల్లేశం, పెద్దేముల్ మండల అధ్యక్షుడిగా వీరేశం, బషీరాబాద్ మండల అధ్యక్షుడిగా జగన్ , దోమ మండల అధ్యక్షుడిగా మల్లేశ్ యాదవ్, గండిడ్ మండల అధ్యక్షుడిగా విజయ్ కుమార్, పరిగి పట్టణ అధ్యక్షుడిగా బాలకృష్ణారెడ్డి, పూడూరు మండల అధ్యక్షుడిగా రాఘవేందర్, కుల్కచర్ల మండల అధ్యక్షుడిగా వెంకటేశం, చౌడపూర్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. జిల్లాలో మొత్తంగా 22 మండలాలు నాలుగు మున్సిపాలిటీలు ఉండగా మిగితా వాటికి త్వరలోనే ఎన్నికలు నిర్వహించి భర్తీ చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు.







మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పిడమర్తి రవి

కీసర రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో గురువారం కీసర ఉమ్మడి మండల మాదిగల ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలకు జనాభా ప్రాతిపదికన 12శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినప్పటికీ, అమరావతిలో నిర్వహించాల్సిన 'లక్ష డప్పులు వేయి గొంతుకలు' కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు మార్చడం బాధాకరమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఎస్సీ వర్గీకరణకు ఉద్యమం కొనసాగించాలన్నారు. ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థి యువగర్జన కార్యక్రమానికి మాదిగలంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మీసాల మల్లేష్, బక్కని నర్సింగ్‌రావు, అంబేద్కర్ సంఘం కీసర మండల అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, గంగి మల్లేష్, చినింగని నర్సింహా, బాలయ్య, లింగం, స్వామి, బక్కని కుమార్, బోడ జంగయ్య, మంచాల రాజలింగం, గరుగుల మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో గురువారం కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ, మండల ప్రజల సౌకర్యార్థం డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, నాయకులు దూడల వెంకటేష్‌గౌడ్, డాక్టర్ మైలారం దుర్గాలతతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం



దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతన్విడం అభినందనీయమని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ వసతి గృహంలోని 230 మంది విద్యార్థులకు మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన విఘ్నేష్‌గౌడ్ దుప్పట్లను ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య సమక్షంలో విద్యార్థులకు అందించారు. ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ముందుకు రావడం చాలా గొప్ప విషయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రశాంతి

ఘట్‌కేసర్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ, నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్‌సీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అయిందాల ప్రశాంతికి డాక్టరేట్ లభించింది. చైతన్యభారతి ఇంజనీరింగు కళాశాల ప్రొ.డాక్టర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రశాంతి 'ఎ మెషిన్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ అండ్ అల్గోరిథమ్స్ ఫర్ అనోమెలే డిటెక్షన్ టువార్డ్స్ నెట్‌వర్కింగ్ సెక్యూరిటీపై పరిశోధన చేసినందుకు గానూ ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ అందజేసింది. కళాశాల డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, సీఎస్‌సీ హెచ్‌వోడీ రామేశ్వరయ్య, అధ్యాపకులు ప్రశాంతిని అభినందించారు.

రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీకి విద్యార్థి ఎంపిక



ఫణిందర్‌రెడ్డి

కీసర రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ(ఆర్‌ఐఎంసీ)కి క్రాంతికిరణ్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కళ్యాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ఒకటి చొప్పున కేటాయించబడిన సీటును క్రాంతికిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థి సాధించడం సంతోషంగా ఉందని పాఠశాల యాజమాన్యం, విద్యార్థి తల్లి తండ్రులు సంతోషం వ్యక్తం చేసారు. నల్గొండకు చెందిన విద్యార్థి ఫణిందర్‌రెడ్డి పాఠశాలలోని ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ఈ ఘనతను సాధించినట్లు వివరించాడు. రాత పరీక్ష అనంతరం, వైవా చివరగా మెడికల్ టెస్ట్ నిర్వహించి సీటును కేటాయిస్తారని తెలిపారు.



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంజులారమేష్

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వికారాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్ అన్నారు. ఆమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బ్లాక్ గ్రౌండ్‌లో బాలబాలికల సబ్ జూనియర్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్‌ను పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేనావత్ పరుశురాం నాయక్ మాట్లాడుతూ. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన టీమ్‌కు రూ.10 వేల బహుమతి, రన్నర్‌గా నిలిచిన టీమ్‌కు రూ.5వేల బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. అబ్బాయిల నుంచి 12 మందిని, అమ్మాయిల నుంచి 12 మందిని ఎంపిక చేసి స్టేట్ స్థాయి కబడ్డీ పోటీలు వచ్చే నెల వికారాబాద్ జిల్లాలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, రమేష్ కుమార్, విశ్వనాథం సత్యనారాయణ, రత్నారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, పల్లె దవాఖానకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బురాన్‌పూర్‌లో గురువారం రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.20లక్షలతో పల్లె దవాఖానాకు ఏఈ సురేందర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భీమయ్యగౌడ్, అనంతయ్య, రాజేశ్వర్, వెంకటయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



కులకచర్ల: వాలీబాల్ క్రీడాకారులతో కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కుసుమ సముద్రం గ్రామంలో గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్యతో కలిసి భీమ్‌రెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు కుమ్మరి స్వామి, ఎల్లప్ప, జలీల్‌ఖాన్, రాములు, శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే యువకులకు అండగా ఉంటాం

చౌడాపూర్: క్రీడల్లో రాణించే యువకులకు అండగా ఉంటామని బీజేపీ జిల్లా మోర్చా కార్యదర్శి శంకర్‌నాయక్ అన్నారు. లింగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. టోర్నమెంట్‌లో వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవింద్‌నాయక్, శంకర్‌నాయక్, కృష్ణయ్య, లక్ష్మి, నర్సింహా పాల్గొన్నారు.



జేసీబీతో తవ్వకాలు జరిపి శవాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

శంషాబాద్‌లో దారుణం

- కోడలిని హత్య చేసిన కసాయి అత్త
- మరో వ్యక్తి సాయంతో సెల్లార్‌లో పూడ్చిపెట్టిన వైనం
- పోలీసులనే తప్పుదోవ పట్టించిన నర హంతకులు
- పూడ్చిపెట్టిన శవాన్ని వెలికి తీసిన పోలీసులు



మూడావత్ జోలీ (ఫైల్)

శంషాబాద్, శంషాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రామాంజాపూర్‌తండాలో దారుణం చోటు చేసుకుంది. సొంత కోడలిని మరోవ్యక్తి సహాయంతో హత్యచేసి మృతదేహాన్ని ఓ వెంచర్‌లోని సెల్లార్‌లో పూడ్చిపెట్టింది. పోలీసులు గురువారం వెలికితీయడంతో ఈ దారుణం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గత నవంబర్ 11న భర్త సురేశ్ తన భార్య జోలీ కనిపించడంలేదని శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శంషాబాద్ మండలం రామాంజాపూర్‌తండాలో నివాసముండే ముడావత్ సురేశ్, ముడావత్ జోలీ(35) దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు. సురేశ్ తల్లిదండ్రులు తులసి, అనంతి శంషాబాద్.

పథకం ప్రకారమే హత్య

తన భర్త సురేశ్ రోజూ తప్పతాగి వచ్చి కొడుతున్నాడని జోలీ అత్తామామలకు చెప్పింది. కొడుకు సురేశ్ తన భార్య వేధిస్తుందని తల్లిదండ్రులకు చెప్పేవాడు. జోలీ తన కొడుకును వివాహం చేసుకోవడం ఇష్టంలేని తులసి కూడా కోడలితో గొడవపడేది. ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో అత్త తన భర్తతో కలసి సాతంరాయి వచ్చి కూలీ పనులు చేస్తూ వేరుగా ఉంటున్నారు. గతేడాది నవంబర్ 9న కోడలు తన భర్త మద్యం తాగి వచ్చి బాగా కొట్టాడని చెప్పింది. దీంతో అత్త సాతంరాయికి రమ్మని, ఇక్కడే కూలీ పని చూపిస్తానని నమ్మబలికింది. జోలీ సాతంరాయిలోని అత్త వద్దకు వచ్చింది. కోడలును చూడగానే అత్త కల్లు దుకాణానికి తీసుకెళ్లి తాగించింది. మత్తు ఎక్కాక మరో రెండు సీసాల కల్లుతెప్పించి అందులో గులికల మందు కలిపి తాగించింది. మత్తులోకి జారుకున్న కోడలిని మరో వ్యక్తి సహాయంతో దగ్గర్లోని త్రిలోక్ వెంచర్‌కు తీసుకెళ్లి సెల్లార్‌లో గోతితీసి పూడ్చిపెట్టింది. సురేశ్ తన భార్య కోసం రెండు రోజులు వెతికి నవంబర్ 11న శంషాబాద్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసునమోదు చేసకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అత్తపై అనుమానం వచ్చి తమదైన శైలిలో ప్రశ్నించంగా కోడలిని హత్య చేసి పాతిపెట్టిన విషయం తెలిపింది. దీంతో పోలీసులు త్రిలోక్ వెంచర్‌లో మృతదేహాన్ని జేసీబీతో తవ్వి బయటకు తీశారు. రాజేంద్రనగర్ మండల రెవెన్యూ అధికారి రాములుతో శవ పంచనామా చేయించి భర్తకు అప్పగించారు. ఈ హత్యకు ఎవరెవరు సహకరించారు అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

పంచాయతీ ఎన్నికల సందడి షురూ

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- ప్రారంభమైన విందులు, వినోదాలు
- ఫ్యూచర్ సిటీ పరిధిలో సందిగ్ధత!
- కార్పొరేషన్ ఏర్పాటు చేస్తారనే ఊహాగానాలు
- అథార్టీ లేదా కార్పొరేషన్ ఏర్పాటు : కేఎల్లార్



మహేశ్వరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంగా పంచాయతీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నాయకులకు.. త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకుల ఆశలకు జీవం పోసినట్లయింది. 2024 జనవరి 31న సర్పంచుల పదవీకాలం ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దాంతో ప్రజలే కాకుండా పార్టీల నాయకులూ చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రభుత్వ ప్రకటనతో రాష్ట్ర ఎన్నికల సంఘం జీపీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే గ్రామాల్లో ఓటర్ల జాబితా, వార్డుల విభజన ప్రక్రియను అధికారులు సిద్ధం చేశారు. ఈమేరకు ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను 'టీపోల్'లో అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల వారిగా అమల్లో ఉన్న రిజర్వేషన్ల వివరాలను జిల్లా అధికారుల నుంచి సేకరించింది. ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ వార్డుల వారిగా విభజించి అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను కూడా ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోనుంది. మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలు, 260 వార్డులు ఉండగా.. వీటికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆయా గ్రామాల్లో సర్పంచులుగా పోటీ చేయాలనే ఆశ ఉన్న వివిధ పార్టీల నాయకులు తమ పంచాయతీ, వార్డుల్లో రిజర్వేషన్‌పై ఆశగా ఎదురు చూస్తున్నారు. పోటీ చేయాలనుకున్న ఆశావహులు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా ఇప్పటివరకు గ్రామాల్లో ఎక్కువ శాతం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉండగా.. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కొందరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే యువతను మచ్చిక చేసుకోవడానికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఏమవ్వా బాగున్నావా? ఏం తాత బాగున్నావా? అంటూ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన మహేశ్వరం, నాగారం, మన్‌సాన్‌పల్లి, అమీర్‌పేట, పెండ్యాల, దుబ్బచర్ల, తుమ్మలూరు, మాణిక్యమ్మగూడ వంటి గ్రామాల్లో మాత్రం ఓటుకు రూ.5నుంచి 10 వేలు కూడా ఖర్చు చేయడానికి నాయకులు ఇప్పటి నుంచే సమకూర్చుకుంటున్నారు.

ఫ్యూచర్‌సిటీ పరిధిపై సందిగ్ధం

పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని ఎంతో ఆశతో ఉన్న మహేశ్వరం, తుమ్మలూరు, మన్‌సాన్‌పల్లి, సిరిగిరిపురం, మెహబత్‌నగర్, ఆకన్‌పల్లి, గట్టుపల్లి, కేసీ తండా, గంగారం, ఉప్పుగడ్డతండా, ఎన్డీతండా నాయకులు అంతే నిరుత్సాహంగా కూడా ఉన్నారు. ఎందుకంటే ఈ గ్రామాలన్నింటినీ కలుపుకొని మహేశ్వరం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటవుతుందనే వార్తలు ఆరు నెలలుగా వివిధ పార్టీల నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అంతేకాకుండా మహేశ్వరం, కందుకూరు, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలను కలుపుకొని ఫ్యూచర్‌సిటీని ప్రత్యేక అథార్టీ లేదా కార్పొరేషన్ చేసే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ చేసిన ప్రకటన ఆయా మండలాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయితే, అధికారులు మాత్రం దీనిపై ఏమీ మాట్లాడటం లేదు.



చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో పతంగులు ఎగర వేయడానికి చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారులు జగన్‌మోహన్, అన్వర్ హుస్సేన్‌లు అన్నారు. పట్టణంలో గురువారం గాలి పటాలు విక్రయిస్తున్న దుకాణాలలో అటవీ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

ప్రగతి నిరోధకంగా విపక్షాలు

ఆమనగల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపక్షాలు ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారాలకు ఒడిగట్టారని వారు మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ప్రగతిని అడ్డుకునే వారు ఎంతటి వారైన ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. రాష్ట్రంలో ప్రగతిని జీర్ణించుకోలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

మహేశ్వరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ గ్రామాల్లో చేసిన అభివృద్ధి తప్పా.. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంగా చేసిందేమీ లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పడమటి తండాలో నూతన గ్రామపంచాయితీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి.. ఏ ఒక్కటీ అమలు చేయకుండా ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడమే సీఎం చేసిన అభివృద్ధి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నేతృత్వంలో గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడేవన్నారు. తండాలను జీపీలుగా తీర్చిదిద్దిన ఘనత కూడా బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి అసమర్థత పాలనను నిలదీస్తున్న కేటీఆర్‌పై.. ఫార్ములా-ఈ కార్ రేస్ విషయంలో అక్రమ కేసుతో జైలుకు పంపాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మరిచిపోతున్నారన్నారు. కార్యక్రమంలో రాజునాయక్, పాండుయాదవ్, దేవ్లానాయక్, జంగయ్య, ఆంజనేయులు,యాదయ్య, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పడమటి తండాలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

పడమటి తండాలో జీపీ భవనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి ఏకపక్షంగా.. జిల్లా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జై తెలంగాణ, జై సబితమ్మఅంటూ ఎదురు దాడికి దిగారు. పరిస్థితి చేజారకుండా మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు రంగంలోకి దిగి ఇరు పార్టీల నాయకులను సముదాయించి గొడవలకు తావు లేకుండా చేశారు.

సబితారెడ్డిది అధికార దాహం : భాస్కర్‌రెడ్డి

కాగా, సబితారెడ్డికి ఎప్పుడూ అధికార దాహం తప్పా.. ఓ సిద్ధాంతం, ప్రొటోకాల్ తెలియదని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం మండలం పడమటి తండాలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు అధికార యంత్రాంగానికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా తన అనుచరులతో వచ్చి ప్రారంభించడంపై పడమటి తండాలో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఈ కార్యక్రమానికి వస్తారని తెలిసి.. అధికారులకు సమాచారం లేకుండా కార్యక్రమాలు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు కాకి ఈశ్వర్, యాదయ్య నర్సింహ, రాజునాయక్, లాజర్, శివ, చంద్రమౌళి, భాస్కర్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కడ్తాలలో భట్టిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లులో మల్లును సత్కరిస్తున్న మండ్లీ రాములు, కేశవులు, శ్రీనివాస్ రెడ్డి, మానయ్య

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఆమనగల్లు/కడ్తాల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదల శ్రేయస్సును కాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాలలో గురువారం మల్లు భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం లభించింది. వనపర్తి జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఎంపీ డాక్టర్ మల్లు రవితో కలిసి వెళ్తున్న భట్టి విక్రమార్కకు ఆయా చోట్ల రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, కాంగ్రెస్ నేతలు బ్యాండ్ వాయిద్యాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. కడ్తాల మండలం మక్తమాదారంలో విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మైసిగండిలో, పలు చోట్ల నివాస గృహల మీదుగా ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్లను తొలగించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఆమనగల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, అజీం, వస్పుల శ్రీశైలం, గాజుల శ్రీను, ఖాదర్‌ఖాద్రీ, విజయ్, మల్లేశ్ నాయక్, అలీం, ఫరీద్, వస్పుల శ్రీకాంత్, నాజర్, ఖాదర్, రాఘవేందర్, బాల్‌రాజ్, మహేశ్, సురేశ్ నాయక్, కండె సాయి, బాబా, మల్లేశ్ గౌడ్, అశోక్, శంకర్, నరేందర్, లక్‌పతినాయక్, చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య, రాజేందర్, రాజేశ్, ఇమ్రాన్‌బాబా, షాబొద్దీన్, బోసు రవి, జగన్, జంగారెడ్డి, సత్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ధరలకు రెక్కలు

(3వ పేజీ తరువాయి)

ధరలు యాసంగిలో భారీగా పెరగడంతో రైతులపై మరింత ఆర్థిక భారం పడనుంది.

గిట్టుబాటు కావడం లేదంటున్న వ్యాపారులు

భవిష్యత్తులో ఎరువుల కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉండడంతో దీన్ని నివారించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు మొదలు పెట్టింది. ఎరువులను ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రమే విక్రయించేలా వ్యవసాయ అధికారులు వ్యాపారులపై వత్తిడి పెంచారు. ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతు వేలి ముద్ర తీసుకోవడం లేదా ఆధారిత ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా విక్రయాలు చేయాలని సూచిస్తున్నారు. బస్తాపై రూ.265 రూపాయల ఎమ్మార్పీ ఉండగా ఇది తమకు గిట్టుబాటు కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఎరువుల కంపెనీ నుంచి సరుకు వచ్చే వరకు బస్తాకు రూ. 285 నుంచి రూ. 290 వరకు ఖర్చవుతుందని అందుకే యూరియా రూ. 300లకు విక్రయిస్తున్నామని కొందరు చెబుతున్నారు.

అందని రైతు భరోసా

మళ్లీ ఎరువుల ధరలు పెరగడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం పెట్టుబడి సాయం(రైతుబంధు) కింద అందిస్తున్న సాయం కూడా ఇంత వరకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కూడా పెరిగిన ఖర్చులతో ఆవిరవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలతో పాటు కూలీల ధరలు పెరగడంతో రైతులకు వ్యవసాయ పెట్టుబడి మరింత భారంగా మారిన సంగతి విదితమే. దీంతో ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడిసాయం కూడా రైతులకు సరిపోవడం లేదు. వాస్తవానికి రైతులకు గతంలో కేంద్రం రైతులకు సరఫరా చేసే ఎరువులకు భారీగా సబ్సిడీ ఇచ్చేది. కానీ ఇటీవల కాలంలో సబ్సిడీని తగ్గించేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్రం మళ్లీ ఎరువులపై సబ్సిడీ పెంచాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

తుది దశకు కొనుగోళ్లు

(3వ పేజీ తరువాయి)

పూర్తి చేయడంతో ఈ ఏడాది ధాన్యాన్ని విక్రయించిన వెంటనే డబ్బులను ఇవ్వగలిగారు. యాలాల మండలంలో అత్యధికంగా ధాన్యాన్ని 54 వేల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. రెండో స్థానంలో పరిగి ఉంది. తాండూరులో డీసీఎంఎస్ ద్వారా సన్నాలకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బెల్కటూర్, మంబాపూర్, పరిగిలో మాత్రమే ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తం 30 వేల ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు.

మిల్లింగ్‌కు ఆసక్తి చూపని మిల్లర్లు

కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు కేవలం 24 మిల్లర్లు మాత్రమే ముందుకు వచ్చారు. కొన్ని రైస్ మిల్స్ డిఫాల్టర్‌గా ఉండటంతో ప్రభుత్వం ఆయా మిల్లులకు ధాన్యాన్ని అలాట్ చేయలేదు. అయితే క్లియర్‌గా ఉన్న మరి కొన్ని మిల్లులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు ముందుకు రాలేదు. ప్రభుత్వం కొన్ని మిల్లులకు బలవంతంగా మిల్లింగ్ చేసేందుకు కట్టబెట్టింది.

లక్ష్యాన్ని చేరుకున్నాం



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. ఏర్పాటు చేసిన కేంద్రాలను మూడు, నాలుగు రోజుల్లో మూసి వేస్తాం. డీసీఎంఎస్ సిబ్బంది కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడంతో రైతు ఖాతాల్లోకి సకాలంలో డబ్బులు జమ చేశాం. రైతులు సంతోషంగా ఉన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాం.

-శ్యాంసుందర్‌రెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్

జీవన ఎరువుతో పంటకు జీవం

- అన్ని రకాల పంటలకు మేలు
- రైతువేదికల్లో సబ్సిడీపై అందుబాటులో..

దుద్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరుగుతోంది. దీని వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా చీడ, పీడల సమస్య అధికం అవుతోంది. మరో వైపు రసాయనిక ఎరువుల ఖర్చు విపరీతంగా పెరగడంతో రైతులకు భారంగా మారుతోంది. దీన్నిదృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రైతువేదికల ద్వారా సబ్సిడీపై జీవన ఎరువులను పంపిణీ చేస్తోంది.

జీవన ఎరువుల పనితీరు

సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా జీవన ఎరువుల ప్రాధాన్యత రోజురోజుకు పెరుగుతున్నది. కొన్ని రకాల సూక్ష్మజీవులు గాలిలో ఉన్న నత్రజనిని జీవ చర్యల ద్వారా స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి. అదేవిధంగా భూమిలోని భాస్వరాన్ని కూడా పూర్తిస్థాయిలో మొక్కలకు అందేలా చేస్తాయి. నేలసారాన్ని కాపాడటంలోనూ, నాణ్యత, దిగుబడిని పెంచడం కోసం ప్రధాన భూమికి పోషిస్తాయి. ఈ సూక్ష్మజీవులు, బ్యాక్టీరియాతో జీవన ఎరువులు తయారు చేయబడింది.

ఉపయోగాలు

జీవన ఎరువుల వాడకంతో ఫాస్పోరిక్ ఎరువుల ధరలో 25 నుంచి 40 శాతం తగ్గుతుంది. నత్రజని, భాస్వరం ఎరువుల వాడకంతో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చు. జీవన ఎరువులు కొన్ని రకాల హార్మోన్లు, విటమిన్‌లు, ఎంజైములను ఉత్పత్తి చేయడంతో మొక్కలు ఏపుగా పెరిగేందుకు దోహదపడుతుంది. భూసారం పెరగడంతో పాటు నేల నుంచి సంక్రమించే తెగుళ్ల కొంత వరకు తగ్గుతాయి. జీవన ఎరువుల తో పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు. భూమిలో లభ్యం కాని స్థితిలో ఉన్న భాస్వరం పూర్తి స్థాయిలో మొక్కలకు అందుతుంది.



జీవన ఎరువును కొనుగోలు చేస్తున్న రైతు

వినియోగించే విధానం

పది లీటర్ల నీటిలో రెండు కిలోల ఫాస్ఫో బ్యాక్టీరియా జీవన ఎరువును కలిపి ఒక బండి పశువుల ఎరువుపై చల్లి కలియబెట్టాలి. దానిని ఒక రోజు నిల్వ ఉంచి ఎకరం పొలంలో వెదజల్లాలి. దీని వల్ల పొలంలోని భాస్వరం మొక్కలకు అందుబాటులోకి వస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జీవన ఎరువులకు వేడి తగలకూడదు. సూర్యరశ్మికి దూరంగా ఉంచాలి. వీటిని పురుగు మందులు, రసాయనిక ఎరువులతో కలిపి వాడకూడదు. విత్తనశుద్ధి చేసినప్పుడు మొదట శిలీంధ్ర నాశనులతో తర్వాత పురుగు మందులతో శుద్ధి చేయాలి. అనంతరం 24 గంటల తర్వాతే జీవన ఎరువులను పట్టించాలి. ప్యాకెట్‌పై సూచించిన గడువు తేదిలోపే జీవన ఎరువులు వాడుకోవాలి.

అన్ని పంటలకు ఉపయోగించుకోవచ్చు



జీవన ఎరువును అన్ని పంటలకు ఉపయోగించుకోవచ్చు. సూచించిన పంటలకు గడువు తేదీలోపు మాత్రమే వాడుకోవాలి. 150ప్యాకెట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్యాకెట్‌కు 50 శాతం సబ్సిడీ పోను రూ.20కి లభిస్తుంది. రైతులు స్థానిక మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొచ్చి జీవన ఎరువులను తీసుకెళ్లాలి.

- తులసి, దుద్యాల, మండల వ్యవసాయ శాఖ అధికారి, బొంరాస్‌పేట్

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి దుర్మరణం

కొడంగల్/కొడంగల్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఓవ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కొడంగల్‌లో జరిగింది. ఎస్ఐ జీవీ.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ పట్టణానికి చెందిన బుగ్గప్ప (50) గురువారం ఉదయం బైక్‌పై శాంతినగర్ కాలనీ నుంచి అంబేద్కర్ చౌరస్తాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లాహోటీ కమాన్ దగ్గర మలుపులో రావుల్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బుగ్గప్ప లారీ ముందు టైర్‌ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శేఖరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేయింటర్ అదృశ్యం



మనోజ్‌కుమార్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేయింటర్ అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన బొజ్జ మనోజ్ కుమార్(22) పేయింటర్ పనిచేస్తుంటాడు. గతేడాది డిసెంబరు 24వ తేదీన మద్యం సేవించి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు. దీంతో తల్లి తాగివచ్చి ఎందుకు గొడవ చేస్తున్నావని మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎన్ని చోట్ల వెతికినా, మిత్రులను, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

నవాబుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. మండ పరిధిలోని పేకాట స్థావరాలపై బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, ప్రొబిషనరీ ఎస్ఐ శ్వేత సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. నవాబుపేట, శంకర్‌పల్లి, చేవెళ్ల, తెల్లపూర్ గ్రామాలకు చెందిన 20మందిని గంగ్యాడ గ్రామంలో పేకాడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గరి నుంచి రూ.32,6511 నగదు, ఐదు కార్లు, ఆరు బైక్‌లు, 21సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపారు.

ముగ్గురి మృతికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

మేడ్చల్ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద ఆదివారం బైక్‌పై వెళ్తున్న బుల్లబ్బాయి, లావణ్యతో పాటు వారి కూతురు హర్షిత మృతిచెందిన ఘటన విధితమే. కాగా లారీ డ్రైవర్ సహబూ ప్రమాదం జరిగిన రోజు లారీ వదిలేసి పరారు కాగా పోలీసులు అతడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సతనారాయణ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం



బీజేపీ వికారాబాద్ పట్టణ అధ్యక్షురాలు శిరీష

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ నూతన పట్టణ, మండల అధ్యక్షులు అన్నారు. పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షురాలిగా యాస్కి శిరీష నియామకమయ్యారు. ఇది వరకు ఆమె బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా పనిచేశారు. అదే విధంగా మండల అధ్యక్షుడిగా శివరాజ్‌గౌడ్‌ను నాయకులు ఎన్నుకున్నారు. గురువారం వికారాబాద్ హరితరిసార్ట్‌లో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు మాదవరెడ్డి ఆధ్వర్యంలో ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్ష బరిలో ఉన్న వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ రేసులో ప్రధానంగా శివరాజ్, రమేష్, కేపీ రాజు, సదానందారెడ్డి, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పోటీ పడుతున్నారు.

తాండూరు: బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షుడిగా నాగారం మల్లేశంకు రెండోసారి అవకాశం దక్కింది. పార్టీ అధిష్టానం మరోసారి కొనసాగేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మరోసారి అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.

బషీరాబాద్: బీజేపీ మండల అధ్యక్షుడిగా జగన్ ముదిరాజ్(కుప్పన్‌కోట్) నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పార్టీ నాయకులు రాజ్‌కుమార్‌కులకర్ణి నేతృత్వంలో పార్టీ శ్రేణులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం ఆయన తాండూరులోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యూ.రమేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భద్రేశ్వర్, రాజశేఖర్, రాఘవేందర్, నరేందర్ పాల్గొన్నారు.

పరిగి: బీజేపీ పరిగి మున్సిపల్ అధ్యక్షుడిగా జి.బాలకిష్టారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురువారం కొత్తగా నియమితులైన బాలకిష్టారెడ్డిని బీసీ సెల్ అధ్యక్షుడు టీవీ నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కులకచర్ల: బీజేపీ కులకచర్ల మండల నూతన అధ్యక్షుడిగా గుడాల వెంకటయ్య ఎన్నికయ్యారు. కులకచర్లలో గురువారం జరిగిన బీజేపీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావుకు, మండల బీజేపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

పూడూరు: బీజేపీ పూడూరు మండల అధ్యక్షుడిగా తుంపల్లి రాఘవేందర్ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డుసభ్యుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేష్ పటేల్ రాఘవేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, బీజేపీ నాయకులు నవీన్ జోషి, పాండు, శ్రీశైలం, ఎం.జంగయ్య, కృష్ణ, నర్సింహులు, సుభాన్, మహేష్, జంగయ్య పాల్గొన్నారు.

చౌడాపూర్: బీజేపీ చౌడాపూర్ మండల నూతన అధ్యక్షుడిగా బ్యాగరి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. చౌడాపూర్‌లో గురువారం నిర్వహించిన బీజేపీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు, బీజేపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, రామాంజనేయులు, జనార్ధన్, మాసయ్య పాల్గొన్నారు.

దౌల్తాబాద్: బీజేపీ దౌల్తాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా అశోక్‌ను ఎన్నుకున్నారు. మాటూర్ గ్రామానికి చెందిన అశోక్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆయన బీజేపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అశోక్‌కు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని మాజీ మండల అధ్యక్షుడు సతీశ్‌ముదిరాజ్ తెలిపారు.



మర్పల్లి మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి

మర్పల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా రామేశ్వర్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

అర్హత లేని వ్యక్తిని ఎన్నుకోవడం సరికాదు

దోమ: బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న జరిగిన దోమ మండల అధ్యక్షుడి ఎన్నికలో అభిప్రాయ సేకరణ మేరకు మెజార్టీ సాధించిన వ్యక్తికి పదవీ ఇవ్వకుండా అర్హత లేని వ్యక్తిని ఎన్నుకోవడం సరైంది కాదని మాజీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పనితీరు పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూపు రాజకీయాలతో మండలంలో బీజేపీ పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధిష్ఠానం గుర్తించి పార్టీ కోసం పని చేసే నాయకులకు సముచిత స్థానం కల్పించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కులకచర్ల కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. కులకచర్ల కేజీబీవీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. వంట గదిని, వంట సామగ్రి, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవి, చౌడాపూర్ కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయుల పట్ల చర్యలు తప్పవన్నారు.

మోమిన్‌పేట్: పాఠశాల, వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఎస్సీ వసతిగృహం, చంద్రాయన్‌పల్లిలో కస్తూర్బాగాంధీ పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకు, ప్రహరీ మరమ్మతులు చేయించాలని వార్డెన్ జైపాల్‌రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

వికారాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే ఆర్టీసీఅభివృద్ధి సాధ్యమవుతుందని వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆర్టీసీ డిపోలో మెయింటెనెన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ మెకానిక్‌గా టీఎస్ రెడ్డి, ఉత్తమ శ్రామిక్‌గా ఎ.రాజును ఎంపిక చేసి ప్రశంస పత్రాలను అందజేశారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

యాలాల, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పరచనున్నట్లు యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. ఆయన యాలాల మండల పరిధిలోని గోరేపల్లి గ్రామంలో గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో వేలాది రూపాయల సీసీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గోరేపల్లిలో ఎనిమిది లక్షలతో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బలరాం, ఎల్లప్ప, బాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకటప్ప, చంద్రప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో ముగ్గుల పోటీలు



విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ 17వ వార్డులో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో పలు కాలనీల నుండి మహిళలు విచ్చేసి ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ముగ్గులు వేసిన వారికి నగదు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేషయాదవ్, నాయకుడు అన్నంరాజ్ శ్రీనివాస్, సెరినిటీ పాఠశాల డైరెక్టర్ నోముల వసంత, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కులకచర్ల: రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారి బాలబాలికలు ఎంతో ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను బండవెల్కిచర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శరత్‌కృష్ణ అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రజిని, సీఆర్‌పీ కృష్ణయ్య పాల్గొన్నారు.


క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలి



వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్యాలు

శామీర్‌పేట, జనవరి 9: విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట జడ్పీ ఉన్నత పాఠశాల్లో బుధవారం రాత్రి హెచ్ఎం వసంతకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులను సాధించి రికార్డులను సృష్టించాలని పిలుపునిచ్చారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎంఈవో వసంతకుమారిని ఉపాధ్యాయులు అభినందిస్తు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాజుయాదవ్, గుంతల లక్ష్మీకృష్ణారెడ్డి, సింగిరెడ్డి రజనీవేణుగోపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, గట్టు ప్రణయ్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



తాండూరులో మైనర్ల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

తాండూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తాండూరు అర్బన్ సీఐ సంతోష్‌కుమార్ సూచించారు. జనవరి 1 నుంచి 31 వరకు జాతీయ రోడ్ల భద్రత మాసం నిర్వహిస్తున్న సందర్భంగా మైనర్ డ్రైవింగ్ అరికట్టడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం 18 సంవత్సరాల లోపు ఉన్న 16మంది మైనర్ల వాహనాలను నడపడానికి ఇచ్చిన వాహన యజమానులపై ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి మేజిస్ట్రేట్ ఎదుటహాజరుపరిచినట్లు తెలిపారు. ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు తాండూరు జూనియర్ కళాశాల, పాఠశాల వద్ద ఈస్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

కులకచర్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయ నిధి వరంలాటిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎ్‌స.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. కులకచర్లలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను కులయర్లకు చెందిన అల్లం హేమలతకు రూ.60వేలు, చాపలగూడెంకు చెందిన గుంటి సాయప్పకు రూ.60వేలు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు



మేడ్చల్: అత్వెల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష పూజార్చనకు ఏర్పాట్లు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు జిల్లాలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం(నేడు) తెల్లవారుజాము నుంచే పలు ఆలయాల్లో దర్శనాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అత్వెల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, జయదర్శిని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, అలియాబాద్ రత్నాలయం, యంనంపేట రంగనాయకస్వామి ఆలయం, ఎదులాబాద్ గోదాదేవి ఆలయాల్లో స్వామివార్ల ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అత్వెల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష పూజార్చన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త సుదర్శనచారి పంతులు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటాపూర్‌లోని తాళ్లకుంట శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తుల సౌకర్యార్థం పందిళ్లు, బారికేడ్లు ఏర్పాట్లుచేశారు. ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని ఉదయం 5 గంటల నుంచే దర్శించుకునేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

తాండూరు రూరల్: వైకుంఠ ఏకాదశి నేడు(శుక్రవారం), ముక్కోటి ద్వాదశి రేపు(శనివారం) పురస్కరించుకుని మండలంలోని దస్తగిరిపేట్ శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఆలయం సిద్ధమైంది. నేడు ఉదయం 4.30గంటలకు మేల్కోలుపు, 5గంటలకు విశేషపూజ, ఉత్తర ద్వారా దర్శనం, రేపు 4.30గంటలకు సుప్రభాతం, 5గంటలకు విశేష అభిశేకం, పూజ, అలంకారం, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. స్వామివారి సేవ చేయదలచిన భక్తులు ఉదయం 4.30గంటలకు అందుబాటులో ఉండాలని ఆలయ ధర్మకర్తలు వెంకటాచార్ శుక్రవార్, రాఘవాచార్ శుక్రవార్, పురంధరాచార్ శుక్రవార్‌లు కోరారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కొడంగల్: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధరూరి శ్రీనివాసచార్యులు తిరుప్పావై ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సంక్షిప్తంగా..

ఆర్టీసీ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

పరిగి: ఆర్టీసీ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని పరిగి ఎస్ఐ సంతోష్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం పరిగి డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ శ్రామిక్ అయిన కలీంపాష, మెకానిక్ ఎండీ ముజీబ్, ఔట్‌సోర్సింగ్ సాయిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎం కరుణశ్రీ, అసిస్టెంట్ మేనేజర్ సోమ్లా పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి రూ.10వేల విరాళం

కీసర రూరల్: పార్కుల అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని నాగారం మున్సిపల్ బీజేపీ నాయకుడు జూపల్లి నరేష్ అన్నారు. మున్సిపల్ పరిధి 16వ వార్డులో నిర్మిస్తున్న పార్కు అభివృద్ధికి గురువారం తన వంతుగా రూ.10వేలను కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి విరాళంగా అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దోమ: అయినాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పరిగి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) 2025 క్యాలెండర్‌ను గురువారం పరిగిలోని ఎంఈవో గోపాల్, జీహెచ్ఎం వెంకట్, టీపీయూఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మహేంద్రమహదూర్, రాష్ట్ర బాధ్యులు జాక వెంకటేశం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిగి, దోమ మండలాల బాధ్యులు మధుసూధన్, రామాంజనేయులు, సాయిబాబా, నరేందర్‌రెడ్డి, బుచ్చిలింగం పాల్గొన్నారు.

దుద్యాల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎంఈవో విజయరామారావు, టీపీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో గురువారం దుద్యాల మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు శంకరప్ప, ప్రధాన కార్యదర్శి తేజస్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కులకచర్ల: పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్ ఆధ్వర్యంలో గురువారం కులకచర్ల మండల కేంద్రంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, అజ్మతుల్లా, వెంకటేశ్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ, గ్రామ పరిశుభ్రతపై సమీక్ష

మోమిన్‌పేట్: ఉపాధిహామీ, గ్రామ పరిశుభ్రతపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతీఒక్కరికి ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలను రాబోయే వర్షాకాలానికి నాటేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. ఉపాధి కూలీలకు పని చేసిన వారం రోజుల్లో కూలీ డబ్బులు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో శంకరయ్య, ఈసీ వికాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

నేడు కేవీపీఎస్ రౌంటేబుల్ సమావేశం

యాలాల: జిల్లా కేంద్రంలో నేడు(శుక్రవారం) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి విక్రయించాలని ఒత్తిడి చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ఫిర్యాదు చేసేందుకు నవాబుపేట పీఎస్‌కు వెళ్లిన మహిళ పట్ల దుర్భాషలాడిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి అరెస్టు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.